సాక్షి
పెద్దపల్లి
గురువారం । 24 । జూలై । 2025

బుధవారం ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు (సెంటీ మీటర్లలో)

జిల్లా	అత్యధికం	అత్యల్పం
పెద్దపల్లి	ధర్మారం 7.86	పాలకుర్తి 1.74
కరీంనగర్	కరీంనగర్ 9.30	గంగాధర 0.4
రాజన్నసిరిసిల్ల	ముస్తాబాద్ 7.69	రుద్రంగి 0.47
జగిత్యాల	నేరెళ్ల 9.01	కథలాపూర్ 0.9



న్యూస్‌రీల్

క్రీడాకారుడికి కాంపౌండ్‌బో



కాంపౌండ్‌బో అందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: నైపుణ్యం గల క్రీడాకారుల ఆసక్తికి అనుగుణంగా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆర్చరీ క్రీడాకారుడు తానిపర్తి యశ్వంత్‌కు రూ.4,30,800 వెచ్చించి కొనుగోలు చేసిన అంతర్జాతీయ నైపుణ్యాలతో కూడిన కాంపౌండ్‌బో పంపిణీ చేశారు. జిల్లా క్రీడల అధికారి సురేశ్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

రామగిరి(మంథని): ఇంజినీరింగ్ విద్యార్థులతోపాటు అధ్యాపకులు కూడా ఆధునిక సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ బులుసు విష్ణువర్ధన్ సూచించారు. ఎడ్యునెట్ ఒప్పందంలో భాగంగా కాలేజీలోని 18 మంది అధ్యాపకులకు సాంకేతికత, బోధన నైపుణ్యం మెరుగుపర్చేందుకు మంథని జేఎన్టీయూలో చేపట్టిన ఐదురోజుల శిక్షణ తరగతులను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఎడ్యునెట్ కింద ఎంపికైన 40 మంది విద్యార్థులకు శిక్షణ పొందిన అధ్యాపకులు తర్ఫీదు ఇస్తారని వివరించారు. ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే వారికి సహాయ, సహకారాలు అందిస్తామని ప్రోగ్రాం ఇన్‌చార్జి తిరుపతి తెలిపారు. ఎడ్యునెట్ ప్రతినిధులు సుమిత్, పవన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీఐలో మలివిడత ప్రవేశాలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో మలివిడత ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. ఆగస్టు 1 నాటికి 14 ఏళ్ల వయసు నిండి టెన్త్, ఎనిమిదో తరగతి చదివి ఉండాలన్నారు. రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు పొందాలన్నారు. వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారన్నారు. వివరాల కోసం 85004 63969 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గట్టుసింగారం.. ఇక పర్యాటకం



జలపాతం(ఫైల్)

పెద్దపల్లిరూరల్: సబ్బితం గ్రామశివారు గట్టుసింగారం జలపాతం పర్యాటకంగా మారనుంది. జలపాతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.6కోట్లు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులుజారీ చేసింది. స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు విన్నపం మేరకు హైదరాబాద్‌లోని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు సబ్బితం జలపాతానికి గతంలోనే చేరుకుని ప్రతిపాదనలు రూపొందించారు. ఆ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.4.50 కోట్లతో పర్యాటక అభివృద్ధి, రూ.1.50కోట్లతో అటవీశాఖ ఆధ్వర్యంలో మరిన్ని పనులు చేపట్టనున్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

'స్థానికం'లో బీజేపీదే విజయం



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న గుజ్జుల, సంజీవరెడ్డి

పెద్దపల్లిరూరల్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీదే అధికారమని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. పెద్దకల్వలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో బీజేపీలో చేరారు. రామకృష్ణారెడ్డి, సంజీవరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు.

కార్మికులను ఆదుకోవాలి



సీఎండీతో సమావేశమైన కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: సింగరేణి మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్రమాజీ మంత్రి, టీబీజీకేఎస్ ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్ కోరారు. హైదరాబాద్‌లో సీఎండీఎండీ బలరాంతో బుధవారం భేటీ అయ్యారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ నాయక్, పుట్ట మధు, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య, ప్రతినిధులు కోలేటి దామోదర్, మిరియాల రాజిరెడ్డి, కె.కృష్ణ, మాదాసు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముసురుతున్న వ్యాధులు

- బాధిస్తున్న జ్వరం.. దగ్గు.. టైఫాయిడ్
- వైరల్ ఫీవర్, వాంతులు, విరోచనాలతో జనం విలవిల
- ఆస్పత్రులకు పేషెంట్ల బారులు
- టెస్ట్‌ల పేరిట ప్రైవేట్ ఆస్పత్రుల బాదుడు
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సూచన



పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి ఓపీ సెంటర్ వద్ద బారులు తీరిన జ్వరపీడితులు

సాక్షి పెద్దపల్లి: వాతావరణం మారుతోంది. వైరల్‌ఫీవర్, టైఫాయిడ్ జ్వరాలు పంజా విసురుతున్నాయి. కొన్నిరోజులుగా కురుస్తున్న ముసురు, మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన భారీ వర్షంతో జిల్లావాసులు సీజనల్ వ్యాధుల బారినపడుతున్నారు. జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో బాధపడుతూ వైద్యం కోసం వస్తున్న వారితో పెద్దపల్లి, గోదావరిఖని, మంథని ఏరియా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రద్దీగా మారాయి. సర్కారు దవాఖానాల్లో ఓపీ కేసులు అధికంగా నమోదవుతుండగా.. ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యపరీక్షల పేరిట పేషెంట్ల జేబులు గుల్లచేస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 24 టైఫాయిడ్ కేసులు, 2 డెంగీ కేసులు నమోదయ్యాయి.

ఫీవర్ తగ్గుతోంది.. దగ్గు వెంటాడుతోంది..

వైరల్ ఫీవర్ నాలుగైదు రోజుల్లో తగ్గుతున్నా దగ్గు, జలుబు రెండు వారాలకుపైగా బాధితులను పట్టిపీడిస్తున్నాయి. దీంతో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోజూ 2 వేలు, ప్రైవేట్‌లో 1,500 నుంచి 2 వేల వరకు ఓపీ కేసులు నమోదవుతున్నాయి. ఇందులో 100 నుంచి 150 వరకు జ్వరంతో బాధపడుతున్న పిల్లలు ఉంటున్నారు. నిత్యం 500కుపైగా రక్తనమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. జ్వరపీడితుల్లో పలు లక్షణాలు కనిపిస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఇష్టానుసారంగా వైద్యపరీక్షలు..

ఆస్పత్రులను ఆశ్రయించేవారిలో అత్యధికులు జ్వరపీడితులే ఉంటున్నారు. పది రోజులుగా ఏ ఆస్పత్రిలో చూసినా సాధారణం కన్నా అధికంగా ఓపీలు

గోదావరిఖని జనరల్ ఆస్పత్రిలో నమోదైన ఓపీ కేసులు

తేదీ	ఓపీ	తేదీ	ఓపీ
23	1,052	18	1,117
22	1,332	17	1,025
21	1,035	16	1,154
19	1,071	15	1,304

నమోదవుతున్నాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవసరం ఉన్నా, లేకున్నా బాధితుల నుంచి శాంపిళ్లు సేకరిస్తూ రక్తం, మూత్ర పరీక్షలు చేస్తూ, అడ్మిట్ చేసుకుంటూ రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు.

టైఫాయిడ్ లక్షణాలు..

- తలనొప్పి, చలి, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, దగ్గు రావడం, శరీరంపై గులాబీ మచ్చలు కనిపిస్తాయి.
- కండరాల నొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలబద్ధకం ఉంటాయి.

కారణాలు..

కలుషితనీరు తాగడం, అపరిశుభ్రత వాతావరణం, ఈగలు ముసిరిన రోడ్డుపక్కన ఉండే తినుబండారాలతో టైఫాయిడ్ జ్వరం వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాదు.. ఈగల ద్వారా వ్యాపించే బ్యాక్టీరియాతో టైఫాయిడ్ వస్తుంది. బాధితుల పేగుల్లోకి అది చేరుతుంది. బాధితులు బహిరంగ ప్రదేశాల్లో విసర్జించిన మల, మూత్రాలపై వాలిన ఈగలతో ఇతరులకూ టైఫాయిడ్ సోకుతుంది.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. తొలివిడతలో ఇంటింటి సర్వే చేశాం. అవసరమైన వారికి వెంటనే మందులు పంపిణీ చేశాం. జ్వర బాధితులు సమీప సబ్ సెంటర్, పీహెచ్‌సీలను సంప్రదించండి. డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. రక్తపరీక్షలు చేసి అత్యవసరమైతే పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తారు. అందరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి.

– అన్న ప్రసన్నకుమారి, డీఎంహెచ్‌వో

నాలుగు రోజులైతంది



కాళ్లకు పుండ్లు అయినయి. వాంతులవుతున్నయి. పెద్దపల్లి ఆస్పత్రికి తీసుకొచ్చిండ్రు. నాలుగు రోజులైతంది. ఐనా జెరం తగ్గుతలేదు. పరీక్షలు చేసిన వైద్యులు జెరం తగ్గేవరకు ఆస్పత్రిలోనే ఉండాలన్నరు.

– కలవేని రాయమల్లు, కొత్తపల్లి

వారం నుంచి జ్వరం



వారంరోజుల కింద జెరం వచ్చింది. స్థానిక వైద్యుడి కాడికిపోయిన. మందులిచ్చిండ్రు. వాడినా తగ్గలేదు. అందుకే పెద్దపల్లి ఆస్పత్రిలో చేరిన. అన్ని పరీక్షలు చేసిండ్రు. ఇక్కడే ఉంచి చికిత్స అందిస్తున్నరు. జెరం కొద్దిగా జారింది.

– బోయిని లచ్చమ్మ, వెన్నంపల్లి

వాంతులు.. విరోచనాలు



ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్న. వాంతులు, విరోచనాలతో స్థానిక ఆస్పత్రిలో చేరిన. తగ్గలే. అందుకే గోదావరిఖని జనరల్ ఆస్పత్రికి వచ్చిన. ఆ తర్వాత జ్వరం వచ్చింది. ఎంతకీ తగ్గుతలేదు. అలసటగా ఉంది.

– కనుకుంట్ల శ్రీనివాస్, గోదావరిఖని

విద్యాప్రమాణాలు పెంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రయోగశాల ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కమాన్‌పూర్(మంథని): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కనీస విద్యాప్రమాణాలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కమాన్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఆయన గణిత ప్రయోగశాల ప్రారంభించారు. పేరపల్లిలో ప్రభుత్వ పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, రొంపికుంట ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పీఏసీఎస్ కార్యాలయాలను సందర్శించారు. విద్యా బోధన తీరుపై ఆరా తీశారు. పదో తరగతి చాలా కీలకమని, ప్రతీ విద్యార్థి బాగా చదివి ఉన్నతంగా స్థాయికి ఎదగాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎరువుల కొరత రాకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, మంథని డీఎల్‌పీవో సతీశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్, ఎంపీడీవో లలిత, ఎంపీవో మారుతి, ఎంఈవో విజయ్‌కుమార్, ఏవో రామకృష్ణ, డీఈలు రాజ్‌కుమార్, దస్తగిరి, ఏఈ మధు, కార్యదర్శులు ప్రసాద్, తిరుపతి, ఉపాధ్యాయులు భరత్‌కుమార్, గసిగంటి రమేశ్, రాజేశ్వరరావు, సతీశ్, శంకర్, రజినివందన, రజితకుమారి, రేణుక, స్రవంతి, ఈశ్వరయ్య, నంబయ్య తదితరులు ఖలీక్ ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయం : ఠాకూర్



బోనంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, భక్తులు

గోదావరిఖని: నగర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక లక్ష్మీనగర్‌లో ఆయన బుధవారం పర్యటించారు. రోడ్ల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాల మరమ్మతు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. నాయకులు మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, శంకర్‌నాయక్, ముస్తాఫా ఉన్నారు.

'మహాలక్ష్మి' మహిళల గౌరవానికి సూచిక

గోదావరిఖనిటౌన్: మహాలక్ష్మి పథకం మహిళల గౌరవానికి, సమాజంలో సమాన హక్కులకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.6,680 కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్న సందర్భంగా ఈ వేడుక నిర్వహించామని తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం పాల్గొన్నారు. అంతకుముందు ఆషాఢ మాసం బోనాల్లో ఎమ్మెల్యే ఠాకూర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటికల సాకారం అవుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. రామునిపల్లి, కనుకుల, మంచిరామి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బుధవారం ఆయన ముగ్గుపోశారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పీఏసీఎస్ జిల్లా డైరెక్టర్ కల్లెపల్లి జానీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాలు జిల్లాలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సందీప్, ప్రశాంత్, ప్రీతం, సాయిరాం మాట్లాడుతూ, బంద్ విజవంతమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థుల పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాలని కోరారు. నాయకులు అరవింద్, ఆదిత్య, సాయి, మధుకర్, నితిన్, వినయ్, రాజు, మనోహర్, నరేశ్, శివ, ప్రణయ్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న వాన



ఓదెలలో పత్తి పంటను ముంచెత్తిన వర్షపునీరు

పెద్దపల్లిలో టోల్‌ఫ్రీ నంబరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కురుస్తున్న వానలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబరు 63031 27484కు ఫోన్ చేసి సమాచారం అందించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ కోరారు. పురాతన ఇళ్లు వాననీటికి తడిసి కూలే ప్రమాదం ఉందని, అందులో నివాసం ఉండేవారు ఖాళీచేసి వెంటనే ఇతర ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

బల్దియాలో హెల్ప్‌లైన్

కోల్‌సిటీ(రామగుండం): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యల కోసం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. బాధితులు 93924 83959 లేదా 96036 66444 నంబర్లలో సంప్రదించాలని బల్దియా కమిషనర్ అరుణశ్రీ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం
- బాధితుల సహాయం కోసం అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్లు



ముత్తారం మానేరులో తెగిన మట్టిరోడ్డు



ఓసీపీలో నిలిచిపోయిన డంపర్లు



ఓదెల అండర్ బ్రిడ్జిలో చేరిన వర్షపునీరు

గోదావరిఖని: జిల్లాలో మంగళవారం రాత్రి ప్రారంభమైన భారీవర్షం బుధవారం రాత్రివరకూ కొనసాగుతూనే ఉంది. అప్పుడప్పుడు తెరిపిచ్చినా.. ఆ తర్వాత దంచికొడుతోంది. ఫలితంగా జిల్లాలోని కొన్నిపల్లవు ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చిచేరింది. చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు రావడం ఆరంభమైంది.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం..

భారీవర్షాలతో సింగరేణిలోని ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మంగళవారం పాక్షికంగా, బుధవారం పూర్తిగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మొత్తం 18 ఓసీపీల్లో 1.70 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్, సింగరేణి యంత్రాల ద్వారా ఓసీపీల్లో రోజూ 13 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీయాల్సి ఉండగా ఆ పనులు ముందుకు సాగడంలేదు. ఓసీపీ క్వారీల్లోకి వర్షపు నీరు వచ్చిచేరడంతో భారీపంప్‌ల ద్వారా బయటకు తోడేస్తున్నారు. ఓసీపీల్లో సుమారు 62 మి.మీ. వర్షపాతం నమోదు అయినట్లు సింగరేణి అధికారులు తెలిపారు. మరోవైపు.. గ్రౌండ్‌స్టాక్ కోల్‌ను సీహెచ్‌పీల ద్వారా రైల్వే నుంచి కస్టమర్లకు రవాణా చేస్తోంది.

అధికారులు అప్రమత్తం

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. జేసీబీ సాయంతో నీటిని తొలగించారు. తహసీల్దార్ బషీరొద్దీన్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎస్సై శ్రవణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ పరిస్థితి సమీక్షిస్తున్నారు.

ఇళ్లను ముంచెత్తిన వరద..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మల్యాలగూడెం, కొత్తపల్లి- మల్యాల మధ్య కల్వర్టులు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. పెగడపల్లిలోని పలువురి ఇళ్లలోకి వర్షపునీరు వచ్చిచేరింది. ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. వర్షపునీళ్లు తొలగించాలని పలువురు మహిళలు అధికారులకు మొరపెట్టుకున్నారు. వర్షాలతో రైతులు, ప్రజల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని తహసీల్దార్ జగదీశ్వరరావు, ఏఎస్సై నీలిమ సూచించారు.

ఓదెలలో భారీవర్షం

ఓదెల(పెద్దపల్లి): కొలనూర్, ఓదెల, గుంపుల, గూడెం, పొత్కపల్లి గ్రామాల్లోని చెరువుల్లోకి వర్షపునీరు వచ్చి చేరుతోంది. గూడెంలో పంటలు నీట మునిగాయి. కాజీపేట - బల్హార్షా సెక్షన్ల మధ్యలోని ఓదెల రైల్వే అండర్‌బ్రిడ్జి వర్షపునీటితో నిండిపోయింది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

జూలపల్లిలో 74.2మి.మీ. వర్షం

ధర్మారం/జూలపల్లి/ఎలిగేడు(పెద్దపల్లి): జూలపల్లిలో 74.2 మి.మీ., ధర్మారంలో 79.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారు. ఎలిగేడు మండలంలో తెల్లవారుజామున ప్రారంభమైన జోరువాన ఉదయం 7 గంటల వరకూ ఏకధాటిగా కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మానేరు ఉధృతి.. తెగిన తాత్కాలిక రోడ్డు

ముత్తారం(మంథని): ముత్తారం మండలం ఓడేడు సమీపంలోని మానేరులో పోసిన తాత్కాలిక మట్టి రోడ్డు వరద ఉధృతికి తెగిపోయింది. దీంతో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మధ్య రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వేతనాలు అందక ఇబ్బందులు

- జీతాలు ఇప్పించాలని డీపీవోకు విన్నవించిన సిబ్బంది



డీపీవో కార్యాలయంలో విన్నవిస్తున్న ఆపరేటర్లు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: జిల్లాలో పనిచేస్తున్న ఈ – పంచాయతీ ఆపరేటర్లకు మూడు నెలలుగా వేతనాలు అందడంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామాలకు వచ్చే ప్రతీఉత్తరాన్ని, ప్రత్యుత్తరాన్ని వీరి ద్వారానే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నివేదిస్తారు. అయితే, ప్రభుత్వాల ద్వారా నిధులు విడుదల కాకపోవడంతో వేతనాల చెల్లింపులు ఆగిపోయాయని అంటున్నారు. గతేడాది వరకు నెలకు రూ.22,750 ఉండగా, ఈ ఏడాది జనవరి నుంచి రూ.19,500 వేతనం వస్తోందని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవికూడా మూడునెలలుగా అందడం లేదంటున్నారు. 2015 నుంచి విధులు నిర్వర్తిస్తున్న తమకు వెంటనే మూడు నెలల బకాయిలు విడుదల చేయాలని బుధవారం డీపీవోతోపాటు ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందజేశారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి



గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇతర పనుల సమాచారం నివేదిక రూపొంలో తయారు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. అయినా, వేతనం పెంచాల్సింది పోయి తగ్గించడం సరికాదు. వెంటనే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి.

– తిరుపతిరెడ్డి, ఈ– పంచాయతీ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, పెద్దపల్లి

జీతాలు ఇవ్వాలి



మాకు మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. మాది మధ్య తరగతి కుటుంబం. జీతం వస్తేనే పూటగడిచేది. తిండికోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– ఎండీ షౌకత్ పాషా, ఈ – పంచాయతీ ఆపరేటర్, సుల్తానాబాద్

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


సిర్రం వెంకటేశ్ మృతదేహం

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలోని నందివాగు ఆవరణ కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిపై రుద్రంగికి చెందిన సిర్రం వెంకటేశ్(48) అనుమానాస్పదంగా మృతిచెందాడు. రుద్రంగి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు. సిర్రం వెంకటేశ్‌ను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని వెళ్లిన యువకుడి అదుపులోకి తీసుకొని విచారించగా ఇంటి వద్ద దించివెళ్లినట్లు తెలిపాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకస్మికంగా విద్యార్థిని..


కుష్బూ(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని కుష్బూ(14) బుధవారం ఆకస్మికంగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బాలిక మృతితో తల్లిదండ్రులు భార్గవి, సురేశ్ కన్నీటి పర్యంతమయ్యారు. కుష్బు మృతికి ఎంఈవో మహేశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు.

కువైట్‌లో ఖాసీంపేట వాసి..


సాగర్(ఫైల్)

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన బత్తుల సాగర్(42) ఉపాధి కోసం కువైట్ వెళ్లి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సాగర్ మూడేళ్లుగా కువైట్ వెళ్తూ.. హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామం వచ్చి తిరిగి వెళ్లాడు. ఈ నెల 22వ తేదీన పని ప్రాంతంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తోటి మిత్రులు సమాచారం ఇచ్చారని కుటుంబసభ్యులు తెలిపారు. సాగర్‌కు తల్లిదండ్రులు, సోదరుడు, భార్య సారవ్వ, కూతురు ఉన్నారు. గురువారం మృతదేహం గ్రామానికి చేరుకోనున్నట్లు స్థానికులు తెలిపారు.

స్వగ్రామానికి మృతదేహం


రమేశ్ గౌడ్ (ఫైల్)

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌కు చెందిన బత్తిని రమేష్ గౌడ్ (43) మృతదేహం బుధవారం స్వగ్రామం చేరింది. రమేశ్ 14 ఏళ్లుగా గల్ఫ్ దేశమైన బెహరాన్‌లో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై వారం క్రితం తన గదిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. రమేశ్‌కు భార్య మేఘన, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బీదర్ టు కరీంనగర్

- రూ.1.14 కోట్ల విలువైన గుట్కా రవాణా
- బుధవారం వేకువజామున పట్టివేత
- 13 మందిపై కేసు, 11 మంది అరెస్టు

కరీంనగర్‌క్రైం: బీదర్ నుంచి గోదావరిఖని మీదుగా కరీంనగర్‌కు పెద్దఎత్తున గుట్కా తరలిస్తున్న రెండు వాహనాలను కరీంనగర్ వన్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలోని తీగల వంతెన సమీపంలో బుధవారం వేకువజామున పట్టుకున్నారు. రూ.1.14 కోట్ల విలువైన 7,60,000 గుట్కా ప్యాకెట్లు, ఒకరి వద్ద రూ.13,17,850 నగదు, 11 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. గుట్కా రవాణాలో గోదావరిఖనికి చెందిన నలుగురు, కరీంనగర్‌కు చెందిన ఏడుగురు ఉన్నారు. వీరిలో ప్రకాశం గంజ్‌కు చెందిన వ్యాపారులు నలుగురు ఉన్నట్లు సమాచారం. వీరిపై కేసు నమోదు చేసి, 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. గుట్కా దందాలో ప్రకాశం గంజ్‌తోనే పెద్దఎత్తున్న సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ప్రకాశం గంజ్‌లోనే మూలాలు...

గుట్కా దందాలో నగరంలోని ప్రకాశం గంజ్‌తోనే పెద్దఎత్తున్న సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఇక్కడ ఉన్న కొందరు వ్యాపారులు అడ్డదారిలో సంపాదనే ధ్యేయంగా దందాను ప్రారంభించారని సమాచారం. ఒక ప్యాకెట్‌కు సుమారుగా రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తుండగా.. పోలీసులు పట్టుకున్న సరుకు విలువ బ్లాక్‌మార్కెట్‌లో రూ.కోట్లలో ఉండనుంది. ఈ దందా వెనక బడాబాబులు ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.


పోలీసులు సీజ్ చేసిన వాహనం

సూక్ష్మ కళ.. భళా

- బియ్యపు గింజతో శివలింగం
- స్వర్ణకారుడి నైపుణ్యం
- అబ్బురపరుస్తున్న కళాకారుడు

పెద్దపల్లిరూరల్: బియ్యంలోని రాళ్లను ఏరడం.. సూదిలో దారం దూర్చడమే కష్టమనుకునే ప్రస్తుత తరుణంలో ఏకంగా బియ్యపుగింజతో శివలింగం తయారు చేయడమే కాకుండా.. మరో బియ్యపుగింజలోకి ఆ శివలింగం దూర్చి అబ్బురపరుస్తున్నాడు పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన ఏలేశ్వరం సత్యబాపుచారి. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని తనలోని సూక్ష్మకళా నైపుణ్య ప్రదర్శించి అబ్బురపరుస్తున్నాడు.

బియ్యపుగింజతో శివలింగం

బియ్యపుగింజపై అక్షరాలు రాయడం, చాక్‌పీస్, సబ్బుబిళ్లపై బొమ్మలు గీసే కళాకారులను ఆదర్శంగా తీసుకుని ఏదోఒకటి వినూత్నంగా తయారు చేయాలనుకున్నాడు స్వర్ణకార వృత్తి చేసే సత్యబాపుచారి. ఆలోచన వచ్చిందే తడవుగా తన మేధాశక్తిని ఉపయోగించి బియ్యపుగింజపై శివలింగం రూపొందించాడు. మరో బియ్యపుగింజకు రంధ్రం చేసి ఈ శివలింగాన్ని అందులోంచి దూర్చి ఆకట్టుకున్నాడు. అంతేకాకుండా బియ్యంతో తయారుచేసిన శివలింగాన్ని ఆవగింజపై నిలబెట్టడం తన సూక్ష్మకళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది.

దారంపోగులు దూర్చి..

బియ్యపుగింజకు రంధ్రంచేసి అందులోంచి ఏకంగా 150 దాకా దారం పోగులను దూర్చి ఔరా అని అబ్బురపరుస్తున్నాడు సత్యబాపుచారి. తన సూక్ష్మకళానైపుణ్యంతో 9 రకాల సూక్ష్మకళారూపాలు ప్రదర్శించడంతో తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డు ఇటీవల వరంగల్‌లో మహానంది జాతీయ పురస్కారంతోపాటు ప్రశంసాపత్రా అందించి సత్కరించారు.


బియ్యపు గింజతో తయారుచేసిన శివలింగాన్ని, మరో బియ్యపుగింజలోకి దూరుస్తూ..
వివిధ ఆకారాల్లో శివలింగం


బియ్యపుగింజకు రంధ్రం చేసి 140 దారం పోగులను దూర్చిన కళాకారుడు


నెల్లూరులో పురస్కారం అందుకుంటూ..

వినూత్న ప్రయత్నమే లక్ష్యం



వినూత్నంగా ఆలోచించి అందరి దృష్టిని ఆకర్షించేలా చేయాలనే ఆలోచనతో బియ్యపుగింజతో శివలింగం తయారు చేశా. ఆ శివలింగాన్ని మరో బియ్యపుగింజలోకి దూర్చేలా ప్రయత్నించి విజయం సాధించా. అదే స్ఫూర్తితో బియ్యపుగింజకు రంధ్రం చేసి దారపు పోగులను దూర్చేందుకు యత్నించా. తొలుతకొంత ఇబ్బందిగా ఉన్నా ఇప్పుడు 150దాకా దారపు పోగులను సులువుగా దూర్చగలిగా. సూక్ష్మకళలో నైపుణ్యం సాధించి గుర్తింపు పొందేందుకు యత్నిస్తున్నా.

– ఏలేశ్వరం సత్యబాపు చారి, స్వర్ణకారుడు పెద్దబొంకూర్

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న చేపల వేట

- ఎల్‌ఎండీలో మునిగి ఇద్దరి మృతి
- కరీంనగర్‌లో విషాదం

తిమ్మాపూర్: కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరుడ్యాంలో చేపలవేటకు వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సయ్యద్ సర్వర్(52), అతని తమ్ముడి కొడుకు సయ్యద్ రిజ్వాన్(20), మహ్మద్ ఇసాక్ కలిసి బుధవారం ఉదయం ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లారు. తిమ్మాపూర్ పరిధిలోని తాపాలగుట్ట సమీపంలో గాలంతో చేపలు పడుతుండగా రిజ్వాన్ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. సర్వర్ రిజ్వాన్‌ను కాపాడేదుకు ప్రయత్నిస్తుండగా ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. కొద్ది దూరంలో ఉన్న ఇసాక్, స్థానిక గంగపుత్రులు వారిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న సీఐ సదన్‌మార్, ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సయ్యద్ రిజ్వాన్, సయ్యద్ సర్వర్ మృతదేహాలు

ప్రాణం తీసిన అతివేగం.. నిద్రమత్తు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఒకరి మృతి.. నలుగురికి గాయాలు

తిమ్మాపూర్: అతివేగం.. నిద్రమత్తు ఒకరి ప్రాణం తీసింది. ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన తిమ్మాపూర్ మండలం రేణికుంటలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని టంగుటూర్ మండలం మణికొండ గ్రామానికి చెందిన సర్వేశ్వరావు హైదరాబాద్‌లోని కాలికాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన పెద్ద కొడుకు మన్నె రాఘవ(22), లంగరు లోకేశ్, స్నేహ స్నేహితులు. స్నేహకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో గంగాధరలో నాటు వైద్యం చేయించడానికి ఆమె తల్లిదండ్రులు రాజేశ్, లక్ష్మీతో కలిసి సెల్ఫ్ డ్రైవింగ్ కారు అద్దెకు తీసుకుని బుధవారం బయల్దేరారు. ఉదయం 10గంటలకు తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులోని టోల్‌గేట్ సమీపంలో రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని వీరి కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. రాఘవ, కారు నడుపుతున్న లోకేశ్, స్నేహ, రాజేష్, లక్ష్మీకి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మన్నె రాఘవ మరణించాడు. రాఘవ తండ్రి ఫిర్యాదు మేరకు లోకేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

రాజన్న సన్నిధిలో వైభవంగా మహాలింగార్చన


స్వామి వారి అద్దాల మంటపంలో మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు, అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

పోరండ్లలో దొంగల బీభత్సం

- మూడిళ్లలో చోరీ

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సష్టించారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చందనం సుగుణ నెల రోజుల క్రితం భర్త సత్యనారాయణ చనిపోవడంతో ఇల్లు వదిలిపెట్టి గ్రామంలోనే అద్దెకు ఉంటోంది. బుధవారం ఉదయం ఆమె కొడుకు మహేశ్ ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులకొట్టి ఉంది. బీరువాలోని మూడు తులాల బంగారం, 20తులాల వెండి, నగదు కనిపించలేదు. సుగుణ ఇంటితో పాటు మామిడిపల్లి తిరుపతి ఇంట్లో రెండు తులాల పుస్తెలతాడు, మామిడిపల్లి అంజవ్వ ఇంట్లో రెండు తులాల బంగారు బిస్కెట్ దొంగతనానికి గురైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దొంగల ముఠా కోసం గాలిస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

- నిందితుడికి రిమాండ్

ముత్తారం(మంథని): డివిజన్‌లోని ఓ గ్రామానికి చెందిన బాలికతో కాల్వశ్రీరాంపూర్ మండలం ఎదులాపూర్‌కు చెందిన చొప్పరి సదానందం(38)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈమేరకు బుధవారం మంథని కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు ఏసీపీ మల్లారెడ్డి విచారణ చేపట్టిన అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధ దంపతులపై దాడి చేసి బంగారు ఆభరణాలు చోరీ

- డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల గాలింపు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి ఊరు చివర ఉంటున్న వృద్ధ దంపతుల ఇంట్లో బుధవారం వేకువజామున దొంగలు చొరబడ్డారు. దంపతులపై దాడి చేసి బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బీర్‌పూర్ ఎస్సై రాజు కథనం ప్రకారం.. రేకులపల్లి ఊరుచివరలో సురారపు గంగయ్య (80) భార్య రాజవ్వతో కలిసి నివాసం ఉంటున్నారు. వేకువజాము మూడు గంటల ప్రాంతంలో గంగయ్య ఇంటి వెనుక ఉన్న తలుపులు పగులగొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. రాజవ్వ మెడలో ఉన్న ఆభరణాలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా.. గంగయ్య అడ్డుకున్నాడు. దీంతో దొంగలు తమ వెంట తెచ్చుకున్న ఆయుధంతో గంగయ్యపై దాడి చేశారు. ఈ ఘటనలో గంగయ్య తొడకు బలమైన గాయమైంది. రాజవ్వపై ఉన్న తులం బంగారు కుత్తికట్టు, గ్రాము ముక్కు పుడక, చేతులకున్న 40 తులాల వెండికడియాలు, సెల్‌ఫోన్ లాక్కొని తిరిగి ఇంటి వెనుక నుంచి పరారయ్యారు. ఇద్దరు దొంగలు నల్లటి దుస్తులు, షూలు ధరించి ఉన్నట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై రాజు పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంల సహాయంతో గాలింపులు చేపట్టారు.


దంపతుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రఘుచందర్

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కోరుట్ల: కోరుట్లలో కొంతకాలంగా నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న రుద్ర వేణుగోపాల్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సురేష్ బాబు కథనం ప్రకారం.. వేణుగోపాల్ పట్టణంలోని పోచమ్మవాడలో మంత్ర ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. రెండేళ్లుగా ఫొటోషాప్ ద్వారా ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెమోలు తయారు చేస్తూ అవసరం ఉన్నవారికి విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారంతో అందడంతో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి దాడి చేసి వేణుగోపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 106 నకిలీ ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, డెత్ సర్టిఫికెట్లు, కంప్యూటర్, కలర్ ప్రింటర్, పేపర్ కటింగ్, ల్యామినేషన్ మిషన్, మానిటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు శ్రీనివాస్, రాజు, అఫ్రోజ్, సాజిద్, వినోద్, సురేష్, కమలాకర్ పాల్గొన్నారు. వీరిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.


రుద్ర వేణుగోపాల్‌ను అరెస్టు చూపుతున్న సీఐ సురేష్ బాబు

అంజన్న తలనీలాల టెండర్ వాయిదా

- టెండర్‌లో కొత్తవారికి అవకాశం
- ఆలయ అభివృద్ధికి అధికారుల నిర్ణయం
- త్వరలోనే టెండర్ ప్రకటన జారీ

సాక్షి స్పందన

మల్యాల: కొండగట్టు అంజన్నకు భక్తులు సమర్పించే తలనీలాల సేకరణ టెండర్‌లో కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఆలయ నిబంధలను సాకుగా చూపి.. కొత్తవారికి టెండర్‌లో పాల్గొనే అవకాశం లేకుండా చేసి.. ఉన్నవారు ఎంతంటే అంత అన్నచందంగా మార్చారు. దీనిపై 'తలనీలాల టెండ'రింగ్' శీర్షికన 'సాక్షి' ఈనెల 22న కథనం ప్రచురించింది. దీనిపై అధికారులు స్పందించారు. తలనీలాల టెండర్‌లో కొత్తవారు పాల్గొనేలా అవకాశం కల్పించారు. ఈ మేరకు ఈ నెల 24న నిర్వహించాల్సిన తలనీలాల టెండర్‌ను వాయిదా వేస్తూ ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు ప్రకటన విడుదల చేశారు. టెండర్ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తులు సమర్పించిన తలనీలాల (ఏడు నెలలు పోగు చేసిన)ను సేకరించేందుకు ఈనెల 18న టెండర్ నిర్వహించారు. ఇందులో 13మంది టెండర్‌దారులు పాల్గొన్నారు. సీల్డ్ కవర్ల అంశంపై పలువురు అభ్యంతరం తెలపడంతో అధికారులు ఈనెల 24కు వాయిదా వేశారు. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు వాయిదా వేసిన టెండర్‌లో కేవలం 13మంది మాత్రమే పాల్గొనవచ్చని, కొత్త వ్యక్తులు పాల్గొనే అవకాశం లేదంటూ అధికారులు నిరాకరించారు. టెండర్‌దారులు కుమ్మక్కై ఆలయ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం చేశారు. గతేడాది కూడా తలనీలాలను కిలో రూ.8500కే దక్కించుకున్నారు. ఈ ఏడాది కొద్దిపాటి మార్పుతో టెండర్ దక్కించుకునేందుకు కొంతమంది బినామీలతో కలిసి టెండర్‌లో పాల్గొన్నారు. అదే యాదాద్రిలో మాత్రం తలనీలాలకు కిలో రూ.20వేలు పలుకుతోంది. యాదాద్రిలో నిర్వహించిన టెండర్‌లో పాల్గొన్న వారే కొండగట్టులోనూ పాల్గొని బినామీలతో టెండర్‌ను దక్కించుకునే ప్రయత్నం చేశారు. ఈ లెక్కన ఆలయానికి సుమారు రూ.50లక్షలకు పైగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు తలనీలాల టెండర్‌లో కొత్తవారికి అవకాశం కల్పించేలా చేశారు.


కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం

దోపిడీ దొంగల ముఠా పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్


సీజ్ చేసిన కార్లు, బైక్‌లు

- ఎనిమిది మంది అరెస్ట్
- రెండు కార్లు, ద్విచక్ర వాహనాలు, ఫోన్లు స్వాధీనం

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడ బీరయ్య టెంపుల్ వద్ద పని నిమిత్తం వచ్చిన జగిత్యాల రూరల్ మండలం కల్లెడకు చెందిన ఇనుగుర్తి శంకరయ్యను ముగ్గురు బెదిరించి.. ఓ ఇంటికి తీసుకెళ్లి అతడి వద్దనున్న పావుతులం బంగారంతోపాటు రూ.లక్ష ఫోన్‌పే చేయించుకున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కల్లెడకు చెందిన ఇనుగుర్తి ఈశ్వరయ్య మంగళవారం జగిత్యాలకు వచ్చాడు. అదే గ్రామానికి చెందిన బండి శ్రీకాంత్ ఫోన్‌చేసి ఎక్కడున్నాడో తెలుసుకొని.. హనుమాన్‌వాడలోని బీరయ్యగుడి వద్దకు చెట్ల మల్లేశ్, హనుమాన్‌వాడకు చెందిన పాలకుర్తి రాజుతో కలిసి చేరుకున్నాడు. శంకరయ్యను బెదిరించి, పాలకుర్తి రాజు ఇంట్లోకి తీసుకెళ్లి దాడిచేసి పావుతులం బంగారం లాక్కున్నారు. బాధితుడి ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రూ.లక్ష బండి శ్రీకాంత్ ఖాతాకు పంపించుకున్నారు. అంతేకాకుండా మధ్యాహ్నం 3 గంటల సమయంలో బండి శ్రీకాంత్, చెట్ల మల్లేశంతోపాటు మరో ఇద్దరు జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఉల్లెందుల సతీశ్, పెగడపల్లి మండలం సుద్దపల్లికి చెందిన బడుగు మురళీ కారులో శంకరయ్యను ఎక్కించుకొని సారంగాపూర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. కత్తులతో బెదిరించి మరిన్ని డబ్బులు డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలోనే సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన ఏలేటి మోహన్‌రెడ్డి, రేచపల్లికి చెందిన అన్నారం రఘు, బండి మధులను పిలిపించి అసలు విషయం తెలిపారు. దీంతో వారు కూడా అతన్ని బెదిరించేందుకు ఒప్పుకున్నారు. బాధితుడిని బైక్‌పై కల్లెడకు తీసుకెళ్లగా.. వాళ్ల అమ్మ మెడలోని పుస్తెలతాడును తీసుకొచ్చాడు. ఆ పుస్తెలతాడును జగిత్యాలలోని టవర్ ప్రాంతంలోని బాలాజీ జువెల్లరీ షాపులో విక్రయించి డబ్బులు తీసుకుంటుండగా బాధితుడి బావ తుమ్మనపల్లి రమేశ్ వచ్చి విషయం తెలుసుకొని ఠాణాకు వస్తుండగా మళ్లీ ఆపి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మంగళవారం సాయంత్రం బాధితుడు శంకరయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు 8 మందిపై కేసు నమోదు చేసి 5 ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. వీరిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. వారి నుంచి పావుతులం బంగారం, ఫోన్‌పే ద్వారా రూ.లక్ష, రెండు బైక్‌లు, రెండు కార్లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బండి శ్రీకాంత్‌పై 22 కేసులు, పడెల మల్లేశంపై 3, పాలకుర్తి రాజుపై 10 కేసులున్నట్లు వివరించారు. కేసును తక్కువ సమయంలో ఛేదించిన పట్టణ సీఐ కరుణాకర్, పట్టణ ఎస్సై సుప్రియ, ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్‌ను ఎస్పీ అభినందించారు. రూరల్ సీఐ సుధాకర్, ఎస్సైలు సధాకర్, కుమారస్వామి, సుప్రియ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.1.10 కోట్లు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలోని 13 హుండీలకు భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు రాజమౌళి సమక్షంలో శ్రీలలిత సేవా ట్రస్టు సభ్యులు లెక్కించారు. 53 రోజులకుగాను రూ.1,10,03,402 వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ నోట్లు 61, మిశ్రమ వెండి, బంగారం తిరిగి బ్యాగుల్లో వేసి, సీల్ చేసి హుండీలో భద్రపరిచినట్లు ఈఓ తెలిపారు. స్థానాచార్యులు తిరుకోవెల కపీందర్, పర్యవేక్షకులు దేశిని సునీల్‌కుమార్, నీల చంద్రశేఖర్, గుండి హరిహరనాథ్, అశోక్‌కుమార్, సుధాకర్, రాములు, రవి కుమార్ పాల్గొన్నారు.


హుండీ లెక్కింపులో శ్రీలలిత సేవా ట్రస్టు సభ్యులు, అధికారులు

అడ్వాన్స్ డబ్బులు ఇవ్వాలని ఆందోళన

పాలకుర్తి(రామగుండం): ఇంటి కొనుగోలు కోసం చెల్లించిన డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్న ఓ వ్యక్తి నివాసం ఎదుట బాధితులు ఆందోళన చేసిన ఘటన బుధవారం కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బోడగుట్టపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు పుప్పాల రాజిరెడ్డి కథనం ప్రకారం.. కన్నాలకు చెందిన మల్క లింగయ్య గతేడాది తనఇంటిని విక్రయించేందుకు నిర్ణయించగా.. రూ.46 లక్షలకు రాజిరెడ్డి కొనుగోలు చేసేందుకు అంగీకరించి తొలుత రూ.26లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. మిగతా సొమ్ము రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించేందుకు నిర్ణయించాడు. అయితే, ఏడాదిగా ఇంటి రిజిస్ట్రేషన్ చేయకుండా, అడ్వాన్సుగా ఇచ్చిన డబ్బులు కూడా తిరిగి చెల్లించకుండా మొండికేస్తున్నాడు. దీంతో తన డబ్బులు తనకు కావాలంటూ లింగయ్య ఇంటిగేట్‌కు రాజిరెడ్డి తాళం వేశాడు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే బైఠాయించాడు. చివరకు పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఎస్సై స్వామి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం పెద్దమనుషుల సమక్షంలో సమస్య పరిష్కరించుకుంటామని లింగయ్య హామీ ఇచ్చారు. దీంతో రాజిరెడ్డి కుటుంబం ఆందోళన విరమించింది.


ఆందోళన చేస్తున్న రాజిరెడ్డి కుటుంబసభ్యులు

ముగ్గురు దొంగలపై కేసులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల తంగళ్లపల్లి మండలంలో కొంతకాలంగా ద్విచక్ర వాహనాలను దొంగతనానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలంలో కొంతకాలంగా ఆడెపు రవికుమార్, మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. వీరిలో ఇద్దరిని పట్టుకోగా ఒకరు పరారీలో ఉన్నాడు. వీరు ఏడు నెలలుగా మండలంతోపాటు ముస్తాబాద్, మాచారెడ్డి, సిరిసిల్ల, వేములవాడలో 10 ద్విచక్ర వాహనాలను దొంగిలించారు. వీటిలో కొన్ని బైకులను చందుర్తి, కరీంనగర్, సిరిసిల్లలోని కొందరికి విక్రయించారు. ఈ బైకులను కొన్న వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేసి బైకులు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై ఉపేంద్రాచారి, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, బాలనర్సయ్య, కానిస్టేబుల్ నరేందర్, రామ్మోహన్, వికాస్‌లను అభినందించారు.


అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి, పోలీస్ సిబ్బంది

మిడ్‌మానేరుకు ఇన్‌ఫ్లో



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి మూలవాగు, మానేరువాగుల్లో నుంచి 210 క్యూసెక్కుల మేర స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో బుధవారం 6.84 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.